సాక్షి
రంగారెడ్డి

గురువారం । 18 । జూలై । 2024



పదేళ్లుగా.. ప'రేషన్'!

నూతన రేషన్ కార్డులు జారీ చేయకపోవడం తో పదేళ్లుగా అర్హులైన ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 8లో ▸



చెంచుల అభ్యున్నతే..

ఆదివాసీ చెంచుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. 8లో ▸



తాళం పగలగొట్టి..

తాళం వేసిన ఇంట్లో 30 తులాల బంగారు, కిలో వెండి ఆభరణాలు చోరీకి గురైన ఘటన తారమతిపేట్‌లో చోటు చేసుకుంది. 8లో ▸



ఆమనగల్లు: పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

జిల్లా వ్యాప్తంగా బుధవారం మొహర్రం వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల వద్ద పీర్లను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలో ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మీర్‌పేట: జిల్లెలగూడ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి

ఘనంగా తొలి ఏకాదశి

ఆషాఢమాసంలో వచ్చే ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడే రుణ మాఫీ

- రూ.లక్షలోపు తీసుకున్న 49,741 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రైతులకు శుభవార్త. పంట రుణాల మాఫీ పథకంలో భాగంగా రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతుల ఖాతాల్లో గురువారం ఆ మాఫీ సొమ్ము జమకానుంది. జిల్లా వ్యాప్తంగా తొలి విడతగా 49,741 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. వీరిలో 497 మంది రైతులు రూ.లక్ష రుణం తీసుకోగా మిగిలిన 49,224 మంది లక్షలోపు తీసుకున్నవారున్నారు. జిల్లా వ్యాప్తంగా 3.34 లక్షల మంది రైతులుండగా, వీరిలో 5.54 వేల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. వీరిలో 2.50 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల నుంచి రూ.4,909 కోట్లు పంట రుణాలు తీసుకున్నట్లు అంచనా. ఈ రుణాలను మూడు విడతలుగా విభజించింది. తొలి విడతలో రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేయనుంది. ఆ తర్వాతి రెండు విడతల్లో(జనవరి 15లోగా) రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించింది. పంట రుణాల మాఫీకి రేషన్‌కార్డును ప్రామాణికంగా ప్రకటించింది. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఈ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గింది. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనూ ఇదే అంశంపై చర్చించారు. రేషన్ కార్డు ప్రామాణికతను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పాస్‌బుక్ ప్రామాణికంగా ఒక్కో ఇంటిని ఒక యూనిట్‌గా తీసుకుని మొత్తం కుటుంబ సభ్యులందరికీ కలిపి రూ.రెండు లక్షల రుణాన్ని మాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. బుధవారం రైతు వేదికల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, పంట రుణాలు పొందిన రైతులతో సంబురాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

భూదాన్‌యజ్ఞ బోర్డు పునరుద్ధరణకు కృషి

రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి



భూదాన్ రామచంద్రారెడ్డి జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

హిమాయత్‌నగర్: భూదాన్‌యజ్ఞ బోర్డును పునరుద్ధరించడానికి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని, ఆ భూములను తిరిగి బోర్డ్ పరిధిలోకి తీసువచ్చేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. తొలి భూదాన్ దాత వెదిరె రామచంద్రారెడ్డితోపాటు తెలంగాణ అమరుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాలలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో భూదాన్ రామచంద్రారెడ్డి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో వెదిరె రామచంద్రారెడ్డి 119వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ భూదాన్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులు కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆయన కోరారు కార్యక్రమంలో ఆల్ ఇండియా సర్వసేవా సంఘం జాతీయ అధ్యక్షు డు వెదిరె అరవింద్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు తోలుపునూరి కృష్ణ గౌడ్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గంట జలంధర్‌రెడ్డి, మహాదేవ్, వినయ్ చంద్రారెడ్డి, ప్రబోధ్ చంద్రారెడ్డి, భీంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మల్లు కరుణ, ఆరుట్ల శ్రీకాంత్‌రెడ్డి, చిట్యాల రామచంద్రం, దేవేందర్‌రెడ్డి, రవీంద్రచారి, శ్వేత ఐలమ్మ, చందు పటేల్ పాల్గొన్నారు.

సరస్వతిగూడలో.. ఎడారి పంట



ఖర్జూర తోట

ఎకరాకు 76 మొక్కల చొప్పన 17 ఎకరాల్లో ఖర్జూర సాగు

- పెట్టుబడికి ఆర్థిక బలం.. దిగుబడికి ఓపిక అవసరం
- యూట్యూబ్‌లో చూసి పంటను ఎంచుకున్న శ్రీనివాస్‌రెడ్డి

కందుకూరు: ఎక్కడో ఎడారి ప్రాంతాల్లో పండే ఖర్జూరాను మన ప్రాంత రైతులు సైతం సాగు ప్రారంభించారు. జిల్లా పరిధిలో ఇప్పటికే వినూత్నమైన పంటలను ప్రయోగాత్మకంగా చేపట్టి ఎంతో మంది రైతులు విజయం సాధించారు. రైతు ఎమ్మిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సైతం ఆ కోవలోకే వస్తారు. ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తూనే తనకు వ్యవసాయంపై ఉన్న మక్కువతో ఖర్జూర సాగు చేపట్టి పలువురు రైతులకు మార్గదర్శకంగా మారారు. ఆ పంట సాగు వివరాలు ఆయన 'సాక్షి'కి వివరించారు.



ఏపీలో డిమాండ్ అధికం

ఖర్జూర పంటకు ఆంధ్రప్రదేశ్ మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అక్కడి నుంచే వ్యాపారులు తన పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేసుకుని తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. మా దగ్గర కిలో రూ.120 చొప్పున విక్రయిస్తున్నామని చెప్పారాయన.

ఒక్కో మొక్కకు రూ.4,250

శ్రీనివాస్‌రెడ్డికి కందుకూరు మండలం సరస్వతిగూడలో పది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో అందరికి భిన్నంగా వినూత్నమైన పంట సాగు చేయాలని ఆలోచించాడు. యూట్యూబ్‌లో ఖర్జూర సాగు విధానం చూసి ఆసక్తి పెంచుకున్నాడు. సరస్వతిగూడలోని ఏడు ఎకరాల్లో, అచ్చంపేట పరిధిలో తన కుటుంబానికి ఉన్న మరో పది ఎకరాల్లో ఖర్జూర పంట సాగు చేపట్టాడు. ఐదున్నర ఏళ్ల క్రితం యూకే నుంచి ల్యాబ్‌లో డెవలెప్ అయిన టిష్యూ కల్చర్ బర్హీ రకం ఖర్జూర మొక్కలను దిగుమతి చేసుకున్నాడు. ఒక్కో మొక్కకు రూ.4,250 చొప్పున కొనుగోలు చేసి తెప్పించుకున్నాడు. నాలుగు అడుగుల పొడవు, వెడల్పుతో గుంతలు తీయించి వర్మీ కంపోస్టు, వేప పిండి వేసి మొక్కలు నాటించాడు. ఎకరాకు 70 మొక్కలు ఆడ, ఆరు మగ మొక్కలు నాటారు. రెండేళ్ల వయస్సు వరకు మొవ్వ పురుగు ఆశించకుండా నెలకు ఒకసారి సైబర్‌మైత్రీన్ లీటరు నీటికి 3–4 మి.లీ కలిపి పిచికారీ చేశారు. ఆ తర్వాత మందులు పిచికారీ అవసరం లేదు. కేవలం ఎరువుతో పాటు కాంప్లెక్ ఎరువులను వాడారు. డ్రిప్ ద్వారా వేసవిలో మూడు రోజులకు ఒకసారి నీరు అందించారు. మిగిలిన సమయాల్లో అవసరాన్ని బట్టి నీరు అందిస్తే సరిపోతుందంటున్నారు.

ఖర్చు ఎక్కువే

ఖర్జూర పంట సాగు చేయాలంటే ఖర్చులు ఎక్కువే. పంట సాగు చేసిన తర్వాత ఐదేళ్ల వరకు నిరీక్షించాల్సిందే. ఆ తర్వాతనే వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు ఖర్చులు పోనూ ప్రతి పంటకు రూ.2 లక్షల వరకు మిగులుతాయి. ఓపిక ఉండి ఆర్థికంగా తట్టుకునే శక్తి ఉంటే సాగు చేయవచ్చు అంటున్నారు రైతు శ్రీనివాస్.

పుప్పొడి అద్దే ప్రక్రియే ప్రధానం

మూడేళ్ల తర్వాత మొదటి పంట ప్రారంభమవుతుంది. జనవరి నుంచి మగ చెట్లకు పుప్పొడి మొదలవుతుంది. ఆ పుప్పొడిని జాగ్రత్తగా సేకరించి అవసరమైతే ఫ్రిడ్జ్‌లో ఉంచుకోవాలి. ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఆడ మొక్కలు పుష్పించడం ప్రారంభమవుతాయి. ఆ సమయంలో మగ మొక్కల పుప్పొడితో గోధుమ పిండి కలిపి ఆడ మొక్కకు వచ్చిన పూతకు అద్దాలి. ఇలా పూత వచ్చిన ఆడ మొక్కలన్నింటికి అద్దే ప్రక్రియ జాగ్రత్తగా చేయాలి. అద్దే ప్రక్రియను బట్టే మొక్క దిగుబడి ఆధారపడి ఉంది. మగ పుప్పొడి సరిపడక ఒక్కోసారి కిలో రూ.12 వేల చొప్పున గుజరాత్ నుంచి తెప్పించి సిద్ధంగా ఉంచుకునేవాళ్లం. పుప్పొడి అద్దిన తర్వాత పేపర్ కవర్లను పూత వచ్చిన గెలలపై రక్షణగా ఉంచాలి. ఒక వారం నుంచే పూత పిందెగా మారడం ప్రారంభమవుతుంది. మే మధ్యలో పచ్చగా ఉన్న కాయలు పసుపు రంగులోకి మారతాయి. ఆ సమయంలో వర్షం కురిసినా కాయలపై పడకుండా ప్రత్యేకంగా దొరికే కవర్‌ను వాటిపై కప్పి ఉంచాలి. లేదంటే కాయలు పగిలి పాడయ్యే అవకాశం ఉంటుంది. గెలలను కిందికి వంచి జాగ్రత్తగా కట్టాలి. జూన్ రెండో వారం నుంచి పంట దిగుబడి మొదలవుతుంది. మొదటిసారి మూడో సంవత్సరం ఎకరాకు 1,500 కిలోలు మాత్రమే దిగుబడి రాగా, ఈ ఏడాది ఐదో సంవత్సరం నుంచి బాగా వచ్చింది. ప్రస్తుతం ఒక్కో మొక్కకు సరాసరి 50 నుంచి 60 కిలోల వరకు దిగుబడి వచ్చింది. పంట బాగా రావాలంటే ఐదేళ్ల వరకు నిరీక్షించాల్సిందే. ఐదేళ్ల వరకు ఎకరాకు దాదాపుగా రూ.10 లక్షల వరకు ఖర్చు చేశాం.



ఖర్జూర పంటను చూపుతున్న రైతు శ్రీనివాస్‌రెడ్డి

ఉపాధి కల్పనకు పెద్దపీట

- విద్య, వైద్యానికి తగిన ప్రాధాన్యం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కడ్తాల్‌లో కేజీబీవీ భవనం ప్రారంభం

కడ్తాల్: రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రూ.3.35 కోట్ల వ్యయంతో జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఈఓ సుశీందర్‌రావు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యుడు బాలాజీసింగ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 15 రోజుల్లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా సర్వారెడ్డిపల్లి సమీపంలో బహుళ జాతి కంపెనీల సహకారంతో వెయ్యి ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అనంతరం యూనిట్ ఏర్పాటుకు శ్రీకారం చుడుతారని వెల్లడించారు. వెల్దండ మండలం చెర్కూర్ వద్ద వంద ఎకరాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, కల్వకుర్తి, కొల్లాపూర్ తదితర ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని స్పష్టంచేశారు. వనపర్తిలో ఐటీ టవర్స్, కంబాలపల్లి వద్ద మెగా ఇండస్ట్రియల్ పార్కు, హైదరాబాద్–బెంగళూర్ జాతీయ రహదారిపై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. కల్వకుర్తి ప్రాంతంలో ఎల్ఈడీ పరిశ్రమ ఏర్పాటును పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిన విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతామని తెలిపారు.

రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం

రైతు రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గురువారం నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని మంత్రి వెల్లడించారు. ఇందుకు రేషన్‌కార్డు ప్రామాణికం కాదని, పాస్‌బుక్ ఆధారంగానే ప్రతీ రైతుకు మాఫీ వర్తింపజేస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే రూ.31 వేల కోట్లతో రైతుల పంట రుణాలను మాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం నిరుద్యోగులను, విద్యార్థులను రెచ్చగొట్టి డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలను అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

విద్యతోనే ప్రగతి

మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. విద్య ద్వారనే ప్రగతి సాధ్యమని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధన్యత ఇస్తోందని తెలిపారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన హరీశ్ రావు మాటపై నిలబడాలని డిమాండ్ చేశారు. సాగునీరు అందించేందుకు కృషి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రైతుల పంట పొలాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. అంతకు ముందు నిర్వహించిన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన మంత్రి జూపల్లి చిత్రంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి, కసిరెడ్డి, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

ప్రాణం తీసిన కుర్ర'కారు' డ్రైవింగ్

- కారు తీసుకుని బయటకు వచ్చిన నలుగురు మైనర్లు
- తిరుగు ప్రయాణంలో బోల్తా పడిన వాహనం
- ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు



బోల్తాపడిన కారు



విఘ్నేష్ (ఫైల్)

శంకర్‌పల్లి: ఇంట్లో చెప్పకుండా కారు తీసుకుని బయటకు వచ్చిన నలుగురు స్నేహితులు.. తిరుగు ప్రయాణంలో ప్రమాదం బారిన పడ్డారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా మైనర్లు కావడం గమనార్హం. ఈ ఘటన బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న నలుగురు స్నేహితులు. తొలిఏకాదశి, మొహర్రం సందర్భంగా బుధవారం సెలవు కావడంతో ఉదయం క్రికెట్ ఆడాలనుకున్నారు. అందరూ కలిసి మహరాజ్‌పేట్ గ్రామంలో ఉన్న మరో మిత్రుడి వద్దకు వెళ్దామనుకున్నారు. ఓ బాలుడు ఇంట్లో చెప్పకుండా కారు తీసుకుని రావడంతో నలుగురూ కలిసి మహరాజ్‌పేట్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో మోకిలతండాలో మరో స్నేహితుడిని ఎక్కించుకుని మహరాజ్‌పేట్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తండాలో ఉండే మిత్రుడిని దింపేశారు. కారు బుల్కాపూర్ రాఘవేంద్ర స్వామి ఆలయ సమీపంలోకి రాగానే డ్రైవింగ్‌లో ఉన్న బాలుడు ఏసీ తగ్గిస్తుండగా.. ఎదురుగా బండరాయి గమనించి తప్పించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతివేగంగా ఉన్న వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ప్రహరీని ఢీకొని పల్టీకొట్టింది. డ్రైవర్ వెనుక సీటులో కూర్చున్న విఘ్నేష్(14)కు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి కుడి చేతి ఎముక విరిగింది. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బటయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. క్షతగాత్రులకు శంకర్‌పల్లిలో చికిత్స అందిస్తున్నారు. డ్రైవింగ్ చేసిన బాలుడు, కారు ఓనర్ అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారికి గాయాలు



మొయినాబాద్: మూడేళ్ల చిన్నారిపై వీధికుక్కలు దాడి చేశాయి. గాయాలతో బయటపడిన బాలికను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటన మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన అమీర్‌గూడలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేకగూడెం వెంకటేష్, సంతోష దంపతుల మూడేళ్ల కూతురు అఖిల మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. అక్కడే ఉన్న కుక్కలు ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేశాయి. తల, మెడ, వీపు, కాళ్లు, చేతులపై కరిచాయి. సుమారు ఐదారు కుక్కలు ఒక్కసారి దాడి చేసి గాయపర్చాయి. చిన్నారి ఏడవడంతో చుట్టుపక్కలవారు గమనించి కుక్కలను తరిమేశారు. వెంటనే నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి ప్రాణాపాయం లేదని 11 రోజులపాటు ఇంజెక్షన్లు ఇప్పించాలని సూచించారు.

కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు

రుణమాఫీ ఘనత రేవంత్ సర్కార్‌దే

- ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమవేశంలో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇందుకు సంబంధించిన నిబంధనలను సైతం విడుదల చేసిందని గుర్తు చేశారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ సర్కార్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయలేదంటూ బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లోనే ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు.

ప్రభుత్వ భూములు స్వాధీనం

గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా కొల్లగొట్టిన మిగులు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 58, 59 జీఓలను అడ్డం పెట్టుకొని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ప్రక్కన ఆక్రమించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. విలేకరుల సమక్షంలో ఆర్డీఓకు ఫోన్ చేసి ఆక్రమణకు గురైన భూముల వివరాలను తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పనులు నిలిచిపోవడానికి కారణాలు తెలుసుకుని వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

భూ సమస్యలకు పరిష్కారం

ధరణితో ఏర్పడిన భూ సమస్యలను తమ ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టి పరిష్కరిస్తుందన్నారు. జూన్ 14 వరకు వచ్చిన సమస్యలను పరిష్కరించిన తర్వాత మిగిలిన సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తారని చెప్పారు. డివిజన్ పరిధిలో 13వేల భూ సమస్యలకుగాను ఇప్పటికే ఏడు వేలు పరిష్కారమయ్యాయని ఆర్డీఓ అనంతరెడ్డి ఎమ్మెల్యేకు ఫోన్‌లో వివరించారు.



చెంచు రైతులకు పంపు సెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి జూపల్లికృష్ణారావు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి, వీర్లపల్లి

చెంచుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- చెంచు రైతులకు వ్యవసాయ మోటార్ల పంపిణీ

కడ్తాల్: ఆదివాసీ చెంచుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పోడు భూముల విషయంలో ఇప్పటికే సాగులో ఉన్న గిరిజనులకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జమ్ములాబావితండాలో బుధవారం చెంచు రైతులకు బోరు మోటార్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షత వహించగా మంత్రి జూపల్లి కృష్ణారావు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో సూరజ్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి రామేశ్వరి దేవి, సహాయ అధికారి వెంకటయ్య, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాత, అధికారులతో కలిసి 26 మంది చెంచు రైతులకు మంత్రి పంపు సెట్లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. చెంచుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. దశాబ్దాల క్రితం చెంచు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను సాగుకు యోగ్యంగా తయారు చేసేందుకు పంపు సెట్లు అందజేశామన్నారు. అటవీ ఉత్పత్తుల ద్వారా చెంచుల ఆదాయ వనరులు పెంచి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా జమ్ములాబావితండా చెంచులు గవర్నర్ పేరిట ఉన్న తమ భూములకు పట్టాలు ఇప్పించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, ఐటీడీఏ అధికారి వెంకటయ్య, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, నాయకులు నర్సింహ, బీక్యానాయక్, బీచ్యానాయక్, రాములు, శంకర్, భాస్కర్‌రెడ్డి, చందోజీ, వెంకటేశ్, జగన్, నర్సింహ, రమేశ్, మహేందర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా.. ప'రేషన్'!

నూతన రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో పదేళ్లుగా అర్హులైన ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఫలితం శూన్యం. కేవలం పేదలపై కపట ప్రేమను ఒలకబోస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నారు.

- నూతన రేషన్‌కార్డులు జారీ కాక తీవ్ర ఇబ్బందులు
- పేరుకుపోయిన ఆన్‌లైన్ దరఖాస్తులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కేశంపేట: దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో రేషన్‌కార్డులను అందించింది. వీటి ద్వారానే లబ్ధిదారులు ప్రభుత్వం అందించే బియ్యాన్ని పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి నూతన రేషన్‌కార్డుల మంజూరును నిలిపివేయడంతో అర్హత కలిగిన కుటుంబాలకు నిరీక్షణ తప్పడం లేదు. పదేళ్లుగా రేషన్‌కార్డులను ప్రభుత్వాలు మంజూరు చేయకపోవడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రేషన్‌కార్డుల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించినా వాటికి ఇప్పటి వరకు అతీగతీ లేదు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఈ మేరకు ఆ హామీని నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటన చేసింది. అందులో రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు పేర్కొంది. అనంతరం రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాల మేరకు రేషన్‌కార్డును వెనక్కి తీసుకుంది.



కేశంపేట తహసీల్దార్ కార్యాలయం

కుప్పలుతెప్పలుగా అభ్యర్థనలు

కొత్త రేషన్‌కార్డు కోసం అర్హులైన లబ్ధిదారులు గతంలో మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో చాలా వరకు అభ్యర్థనలు పెండింగ్‌లోనే ఉన్నాయి. మీ సేవ కేంద్రాల్లో చేసుకున్నా వినతులను ఆర్ఐ పరిశీలన చేసి జిల్లా డీఎస్ఓ కార్యాలయానికి పంపించారు. ఇలా కేశంపేట మండలంలో 369 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 4 దరఖాస్తులను తిరస్కరించగా మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే ఇటీవల ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో కూడా ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా ప్రజాపాలనలో 3,405 దరఖాస్తులు వచ్చాయి. ఇవి కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి.

అదనపు పేర్ల నమోదు

రేషన్ కార్డులో అదనపు పేర్లను నమోదు చేసుకునేందుకు గత ప్రభుత్వం అవకాశం కల్పించింది. పదేళ్ల కాలంలో పెళ్లయిన దంపతులకు రేషన్‌కార్డులో కొంత మందికి భార్య, పిల్లల పేర్లు లేవు. ఇలాంటి వారు తమ కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో చాలా మంది గతంలోనే దరఖాస్తులు చేసుకున్నా అవి కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించే కొన్ని పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసరి. అలాంటి సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దరఖాస్తులు పరిశీలిస్తున్నాం



గతంలో మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలను మేరకు కార్డుల మంజూరు జరుగుతుంది. మీ సేవల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదు.

– అజీంఅలీ, తహసీల్దార్, కేశంపేట

పేదలకు మేలు



గత ప్రభుత్వం రేషన్ కార్డు జారీ విషయంలో చిత్తశుద్ధి చూపలేదు. ఫలితంగా అర్హులైన అనేక మంది పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తక్షణమే నూతన రేషన్ కార్డులు జారీ చేసి పేదలకు మేలు చేయాలని ఆశిస్తున్నాం.

– నరేందర్‌రెడ్డి, సంతపూర్, కేశంపేట

యువతితో అసభ్యంగా ప్రవర్తించిన కండక్టర్ అరెస్ట్

గచ్చిబౌలి: బస్సులో యువతిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ కండక్టర్‌ను రాయదుర్గం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకటేష్ తెలిపిన ప్రకారం వివరాలు... పుప్పాలగూడలో నివాసముండే యువతి(24) పోటీ పరీక్షలకు హిమాయత్‌నగర్‌లో కోచింగ్ తీసుకుంటోంది. ఈ నెల 15న ఉదయం 8 గంటలకు పుప్పాలగూడలో ఫరూఖ్‌నగర్ డిపో ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సులో కండక్టర్ బి.సుబ్బారావు(36) ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బస్సులో తనకు ఎదురైన చేదు అనుభవం గురించి ఆమె ఈ నెల 16న ఎక్స్‌లో పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది. సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం రాయదుర్గం పోలీసులు బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. బీఎన్ఎస్ 75 సెక్షన్ కింద కేసు నమోదు చేసి బుధవారం కండక్టర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

శంకర్‌పల్లి: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మోకిల ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జన్వాడ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(45) రోడ్డు పక్కన పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు ఆ వ్యక్తిని పరిశీలించారు. కానీ అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.

ముదిరాజ్‌ల ఆర్థికాభివృద్ధికి కృషి

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

మొయినాబాద్‌రూరల్: ముదిరాజ్ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం తరఫున కృషి చేస్తానని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ఆయన్ని జిల్లా మత్స్యకార సంఘం చైర్మన్ మహేందర్‌ముదిరాజ్ సభ్యులతో కలిసి బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ముదిరాజ్ కుటుంబ సభ్యులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. విద్యతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ద్వారా వచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందరికీ అందేలా చూస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు గోపాల్, భిక్షపతి ముదిరాజ్, రమేష్‌ముదిరాజ్, ప్రవీణ్‌ముదిరాజ్, జంగయ్యముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను సన్మానిస్తున్న జిల్లా మత్స్యకార సంఘం సభ్యులు

విహారయాత్రకని వెళ్లి.. విగతజీవిగా మారి..

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ మక్త గ్రామంలో బుధవారం ఏకాదశి పర్వదినాన విషాదఛాయలు అలముకున్నాయి. అదే గ్రామానికి చెందిన ఫైనాన్సియర్ చింతపండు జగదీశ్(42) అనుమానాస్పదస్థితిలో మరణించాడు. బంధువులు తెలిపిన వివరాలు... మక్తకు చెందిన నరేశ్ నాయక్, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి జగదీశ్ దేవరకద్ర మండలం నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ ప్రాంతమైన వైజాగ్ కాలనీకి మంగళవారం సాయంత్రం విహారయాత్రకు వెళ్లారు. అందులో ముగ్గురు రాత్రి మద్యం సేవించారు. మరునాడు ఉదయం మిత్రులు నిద్రలేచేసరికి సమీపంలోని నీటిలో జగదీశ్ మరణించి ఉన్నాడు. జాలర్ల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. విహారయాత్రకు వెళ్లినవారిలో ఓ స్నేహితుడు జగదీశ్ వద్ద ఫైనాన్స్ తీసుకున్నాడని, డబ్బులు అడిగితే చంపేశారని, మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

జన్మనిచ్చింది... కాలేయం ఇచ్చింది..

నాంపల్లి: కాలేయసమస్యతో బాధపడుతున్న ఓ మూడేళ్ల బాలుడికి ఉస్మానియా, నిలోఫర్ ఆసుపత్రుల వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేశారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం కొండ వనమాల గ్రామానికి చెందిన మోదుగు గుణశేఖర్, అమల దంపతుల కుమారుడు మాస్టర్ చౌహాన్ ఆదిత్య(3) పుట్టుకతోనే పిత్తాశయ ధమని, కాలేయ సమస్యతో బాధపడుతున్నాడు. స్థానిక వైద్యుల సలహా మేరకు బాలుడిని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కాలేయ మార్పిడి కోసం ఉస్మానియాకు తీసుకెళ్లారు. డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలో ఈ నెల 3న చౌహాన్ ఆదిత్యకు కాలేయమార్పిడి చేశారు. బాలుడి తల్లి కాలేయంలోని కొంత భాగాన్ని తీసి అమర్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మొయినాబాద్‌రూరల్: వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఆర్ఐ నర్సింహాగౌడ్, సిబ్బంది

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఆర్ఐ నర్సింహాగౌడ్

మొయినాబాద్‌రూరల్: వాహనాదారులు పెండింగ్‌లో ఉన్న చలాన్లను వెంటనే చెల్లించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఆర్ఐ నర్సింహాగౌడ్ కోరారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ స్వామి నారాయణ గురుకుల్ సమీపంలో చలాన్ల రికవరీలో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను ఆపి నంబర్ల ఆధారంగా చలాన్లను చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాదారులు హెల్మెట్, నంబర్ ప్లేట్ లేకుండా, ట్రిబుల్ రైడింగ్ తదితర కారణాలతో విధించిన చలాన్లను వెంటనే చెల్లించుకోవాలన్నారు. వాహనాదారులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ సురక్షిత ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సీపీ అభినందన



మీర్‌పేట: ట్రాఫిక్ సిబ్బందికి రివార్డులు అందజేసిన సీపీ సుధీర్‌బాబు

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ప్రయాణిస్తున్న కారు దగ్ధమైన సంఘటనలో వ్యక్తి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ సిబ్బందిని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు బుధవారం అభినందించి రివార్డు అందజేశారు. ఈ నెల 15న మందమల్లమ్మ నుంచి బాలాపూర్ చౌరస్తా వైపు వెంకటేష్‌నాయక్ కారులో వెళ్తుండగా ఏసీ నుంచి అకస్మాత్తుగా పొగలు వచ్చి కారుకు మంటలు వ్యాపించాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది ఏ.నర్సింగ్‌రావు, జి.కృష్ణ, ఆర్.సాయిరాం గమనించి కారు ఆపి వెంకటేష్‌ను అప్రమత్తం చేసి ప్రాణాలు కాపాడారు. మంటలు తీవ్రం కావడంతో ఇతర వాహనాలకు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తక్షణమే స్పందించి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నందున సీపీ సిబ్బంది సమయస్ఫూర్తిని అభినందించి తన కార్యాలయానికి పిలిపించుకుని రివార్డును అందజేశారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళం పగలగొట్టి.. లూటీ చేసి

30 తులాల బంగారు, కిలో వెండి ఆభరణాలు అపహరణ

అబ్దుల్లాపూర్‌మెట్: తాళం వేసిన ఇంట్లో 30 తులాల బంగారు, కిలో వెండి ఆభరణాలు చోరీకి గురైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తారామతిపేట గ్రామానికి చెందిన చేపూరి మధుచారి వృత్తిరీత్యా గోల్డ్‌స్మిత్. సోమవారం తన కుమారుడికి ఆరోగ్యం బాగలేకపోవడంతో ఇంటికి తాళం వేసి హాస్పిటల్‌కు వెళ్లారు. మరుసటిరోజు సాయంత్రం ఇంటి తాళాలు విరగొట్టడడంతో పాటు తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు మధుచారి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చిన మధుచారి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా కబోర్డు తలుపులు తెరిచి ఉండడంతో పాటు దుస్తులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. అందులో పెట్టిన సుమారు 30 తులాల బంగారు, కిలో వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించి క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. అయితే మధుచారి ఇంట్లో చోరీని తెలిసినవాళ్లే చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.



ఇంట్లో చిందరవందరగా పడేసిన దుస్తులు

గౌడ కుల హక్కుల పరిరక్షణకు పాటుపడతా

సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్



మల్లేశ్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు

మొయినాబాద్: గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని శ్రీరాంనగర్ గ్రామానికి చెందిన రేనట్ల మల్లేశ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు పంజాల వెంకట్‌గౌడ్‌లు బుధవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. సంఘం విస్తరణ, అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నక్క మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై కేసు నమోదు

ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇవ్వడంతో

అబ్దుల్లాపూర్‌మెట్: ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై ఉన్నతాధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తారామతిపేట గ్రామంలో భూదాన భూమిలో ఎలాంటి ఇళ్లు నిర్మించకుండానే నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శి ఇంటి నంబర్లు కేటాయించడంతో పాటు మరో నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. అదే క్రమంలో బాటసింగారం పంచాయతీ కార్యదర్శి సైతం ఆ గ్రామంలో ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించారు. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఎంపీఓ వారిద్దరూ అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో డీపీఓ ఆదేశాల మేరకు ఇరువురిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఇరువురు పంచాయతీ కార్యదర్శులపై బుధవారం కేసు నమోదు చేశారు.

ఠాణాకు చేరిన 'పొలిమేర' పంచాయితీ

బంజారాహిల్స్: లాభాలు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడంటూ పొలిమేర-3 నిర్మాతపై పొలిమేర-2 నిర్మాత గౌరీకృష్ణప్రసాద్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2021లో 'మా ఊరి పొలిమేర'సినిమాను కృష్ణప్రసాద్ నిర్మించగా ఈ సినిమా ఓటీటీలో నేరుగా విడుదలైంది. రెండో భాగాన్ని కూడా కృష్ణప్రసాద్ నిర్మాతగా థియేటర్‌లో విడుదల చేశారు. ఈ సినిమాకు మంచి లాభాలు వచ్చాయి. నందిపాటి వంశీ పొలిమేర-2 సినిమాకు డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించారు. ఈ చిత్ర నిర్మాతను తానే కాబట్టి దానికి వచ్చిన లాభాల్లో వాటా ఇవ్వాలని అడిగినందుకు వంశీ చంపేస్తానని వార్నింగ్ ఇచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పొలిమేర-2 విడుదల తరువాత రూ.30 కోట్లు గ్రాస్ కలెక్షన్లు వచ్చాయని, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను పంపిణీ చేసిన వంశీ లాభాల్లోంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. తనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. తాజాగా నిర్మాణం మొదలుపెట్టిన పొలిమేర-3 పార్ట్‌కు నిర్మాతగా వంశీ వ్యవహరిస్తుండటం గమనార్హం. జూబ్లీహిల్స్ పోలీసులు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గం'జాయ్'పై ఉక్కుపాదం

- ధూల్‌పేటలో నియంత్రణకు ఎక్సైజ్ శాఖ కార్యాచరణ
- ప్రత్యేక బృందాలతో విస్తృతంగా దాడులు

సాక్షి సిటీ బ్యూరో: ధూల్‌పేట.. ఇది ఒకప్పుడు నాటుసారా తయారీకి పెట్టింది పేరు. దశాబ్దాలపాటు ఆ ప్రాంతంలో సారా రక్కసి రాజ్యమేలింది. అయితే కొంతకాలంగా సారా ప్రభావం తగ్గింది. ఇప్పుడు గంజాయి గుప్పుమంటోంది. డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా మార్చాలన్న కొత్త ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్, సివిల్ పోలీసులు ఉధృతంగా దాడులు నిర్వహిస్తున్నాయి. గంజాయి నామరూపాల్లేకుండా ప్రయత్నిస్తున్నారు. ధూల్‌పేట్ ప్రాంతంలో అత్యధిక శాతం మందికి రెక్కాడితేకానీ డొక్కాడని పరిస్థితి. పగలంతా కష్టపడి సాయంత్రం ఉపశమనంగా ఒకప్పుడు నాటుసారా, ఇప్పుడు గంజాయిని అలవాటు చేసుకున్నారు. అయితే ధూల్‌పేట్‌లో గంజాయి మత్తు వదిలించడానికి ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండు నెలల నుంచి ఎక్సైజ్ శాఖ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్టేట్ టాస్క్‌ఫోర్స్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇంటింటా సోదాలు నిర్వహిస్తున్నాయి. ఈ నెల 13న ఎక్సైజ్ శాఖ 8 బృందాలతో 120 మంది సిబ్బంది కలిసి తనిఖీలు చేశాయి. గంజాయి క్రయవిక్రయాలు జరిపే వారిని గుర్తించాయి. పోలీసులు కొందరు గంజాయి బాధితులను పట్టుకొని విచారించారు. మూడు రోజులపాటు ధూల్‌పేటలో యువత, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి, డ్రగ్స్‌పై సమాచారాన్ని 18004252523 ట్రోల్ ఫ్రీ నెంబర్‌కు ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

హైదరాబాద్ ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ హెడ్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఐదు టీమ్‌లతో 50 మందిపైగా ఎస్టీఎఫ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కలిసి మంగళవారం నుంచి బుధవారం రాత్రి 11 గంటల వరకు దాడులు నిర్వహించారు. 2 కిలోల గంజాయిని పట్టుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. ధూల్‌పేటలో గంజాయి అమ్మకాలు, రవాణా, వినియోగం నియంత్రణకు ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు తయారు చేసింది.



కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

ఎక్కడివారు వీళ్లు..

నిజాం కాలంలో ఉత్తరప్రదేశ్ నుంచి జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వేలాదిమంది వలస వచ్చి ధూల్‌పేట్ ప్రాంతంలో స్థిరపడ్డారు. గణేష్, అమ్మవారు, ఇతర దేవతల విగ్రహాల తయారీ వీరి ప్రధాన వృత్తి. విగ్రహాలతోపాటు రాఖీలు, పతంగులు తయారు చేస్తుంటారు. అన్ని రకాలు కులవృతుల పనులు చేస్తుంటారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఏడు లక్షల జనాభా ఉంది.